క్లుప్తంగా

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్ల తుది జాబితా విడుదల

చీరాల టౌన్: ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కలిగిన వారి వివరాలను అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్, చీరాల ఆర్డీవో పి.సరోజిని సోమవారం వెల్లడించారు. ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి చీరాల రెవెన్యూ డివిజన్ పరిధిలోని 13 మండలాలకు సంబంధించి ఓటర్లు తుది జాబితా విడుదల చేశామన్నారు. పట్టభద్రుల నియోజకవర్గానికి డివిజన్‌లో 26,390 మంది ఓటు హక్కు పొందారన్నారు. వీరిలో పురుష ఓటర్లు 17,626, మహిళా ఓటర్లు 8723 మంది ఉన్నారన్నారు. అలానే ఉపాధ్యాయ ఎన్నికలకు డివిజన్‌లోని 13 మండలాల్లో 1789 మంది టీచర్లు ఓటు హక్కు పొందారన్నారు. వీరిలో పురుష టీచర్లు 1094, మహిళా టీచర్లు 695 మంది ఉన్నారన్నారు. ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు డివిజన్‌లోని 13 మండలాల్లో 40 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటిలో పట్టభద్రుల ఎన్నికకు 27 పోలింగ్ కేంద్రాలు, ఉపాధ్యాయ ఎన్నికలకు 13 పోలింగ్ కేంద్రాలు ఎంపిక చేసి ఎన్నికలకు సిద్ధం చేశామన్నారు. మార్చి 13న ఓటు హక్కు వినియోగించేకునేందుకు అన్నీ ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నామని ఆర్డీవో తెలిపారు.

జూదరుల అరెస్టు

యద్దనపూడి: మండలంలోని జాగర్లమూడి ఎస్సీ కాలనీలో పేకాట ఆడుతున్న ఐదుగురిని సెబ్ అధికారులు సోమవారం దాడి చేసి పట్టుకున్నారు. ఎక్సైజ్ సీఐ యశోధరా దేవి తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలో పేకాట ఆడుతున్నారని సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి పేకాట శిబిరంపై దాడి చేశారు. దాడిలో ఐదుగురిని అదుపులోనికి తీసుకుని వారి వద్ద నుంచి రూ 2040 నగదు స్వాధీనం చేసుకొని పర్చూరు కోర్టులో హాజరు పరచనున్నట్లు ఆమె తెలిపారు. ఎవరైనా అక్రమ మద్యం అమ్ముతున్నా, పేకాట ఆడుతున్నా 9491 805156 నంబర్‌కు సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

రైతుల అభివృద్ధికి గొప్ప పథకాలు

చీరాల టౌన్: రైతుల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక రాయితీ పథకాలను అందిస్తోందని అన్నదాతలు ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌బీకే చైర్మన్ కె.రమణారెడ్డి సూచించారు. మండలంలోని కావూరివారిపాలెం గ్రామంలోని 11 మంది రైతులు స్ప్రింక్లర్ల కోసం రైతు భరోసా కేంద్రంలో దరఖాస్తులు చేయగా సోమవారం ఆర్‌బీకే అధికారులు పరిశీలన చేపట్టారు. కార్యక్రమంలో ఎం రత్నారెడ్డి, ఆర్‌బీకే అధికారి ఎమేలియా, డీసీవో సాయిరాం, గ్రామానికి చెందిన రైతులు ఉన్నారు.

కోస్తాంధ్ర పద్మశాలి సంఘం ఉపాధ్యక్షురాలిగా పద్మినీదేవి

చీరాల టౌన్: కోస్తాంధ్ర పద్మశాలి సంఘం మహిళా విభాగం నూతన ఉపాధ్యక్షురాలిగా చీరాల జెడ్పీటీసీ ఆకురాతి పద్మినీదేవి నియామకం అయ్యారు. ఈ మేరకు సోమవారం రాష్ట్ర అధ్యక్షుడు జీవీ నాగేశ్వరరావు నుంచి నియామకపత్రం అందుకున్నాని ఆమె తెలిపారు. తనపై నమ్మకం ఉంచి మహిళా విభాగానికి ఉపాధ్యక్షురాలిగా నియామకం చేసిన సంఘం బలోపేతానికి, పద్మశాలీలకు అండగా ఉండి సమస్యల పరిష్కారానికి పాటుపడుతానని ఆమె పేర్కొన్నారు.

నామ్ ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ

అద్దంకి: నామ్ ఎక్స్‌ప్రెస్ వే లిమిటెడ్ ఏల్చూరు టోల్ ప్లాజా యాజమాన్యం ఆధ్వర్యంలో అద్దంకి పట్టణం, మండల పరిధిలో నిరుద్యోగ యువతీ, యువకులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇవ్వనున్నట్లు నామ్ ఎక్స్‌ప్రెస్ బాధ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణలో కంప్యూటర్ బేసిక్స్, ఎంఎస్‌ఎక్సెల్, ఎంఎస్‌వర్డ్, ఎంఎస్ పవర్‌పాయింట్, వర్డ్ ప్యాడ్, నోట్ ప్యాడ్, కంప్యూటర్ ఆపరేటింగ్ సిస్టమ్, కంప్యూటర్ సెక్యూరిటీ అండ్ ఎథిక్స్ నందు శిక్షణ ఇస్తారని చెప్పారు. ఆసక్తి కలిగిన వారు 91212 82536, 86395 91879 నంబర్లలో సంప్రదించాలని వారు కోరారు.

వీఓఏపై సభ్యుల ఫిర్యాదు

యద్దనపూడి: స్వయం సహాయక గ్రూపుల మహిళలను మోసగించిన ఘటనకు సంబంధించి యద్దనపూడి పోలీస్‌స్టేషన్‌లో మహిళలు సోమవారం ఫిర్యాదు చేశారు. ఎస్సై అనంతలక్ష్మి వివరాల మేరకు.. మండలంలోని దక్షిణ యద్దనపూడి గ్రామైక్య సంఘానికి సంబంధించి 4 గ్రూపుల మహిళలు బ్యాంకు నుంచి రూ.5 లక్షలు నగదు రుణం తీసుకున్నారు. 2014–2019 నుంచి తీసుకున్న రుణం నగదును బ్యాంకులో చెల్లించాల్సిందిగా వీఓఏ తన్నీరు అంకమ్మకు చెల్లిస్తూ వస్తున్నారు. అతడు ఆ నగదును వ్యక్తిగతంగా వాడుకొని బ్యాంకులో చెల్లించలేదు. ప్రస్తుత ఏపీఎం వెంకట్రావు గ్రూపు మహిళలను పిలిచి తీసుకున్న రుణం వడ్డీతో కలిపి రూ 7.78 లక్షలు బకాయి ఉందని చెల్లించాల్సిందిగా కోరాడు. వారు నగదును వీఓఏ అంకమ్మకు బ్యాంకులో చెల్లించాల్సిందిగా ఇచ్చామని తెలిపారు. అయితే అతనిని పిలిపించే ప్రయత్నం చేయగా అతడు కనిపించకుండా వెళ్లిపోయాడు. దాంతో గ్రూపుల మహిళలు సోమవారం స్టేషన్‌లో వీఓఏపై ఫిర్యాదు చేశారు. వారిచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మధుర ఫలంపై చిగురిస్తున్న ఆశలు

● విరగబూసిన పూత

వేటపాలెం: మామిడి చెట్లకు పూత ఆశాజనకంగా ఉండటంలో రైతులు అశలు చిగురిస్తున్నాయి. అయితే వాతావరణ మార్పుల కారణంగా మామిడి రైతులు ఆందోళన చెందుతున్నారు. మంచు కురవడంతో పాటు పూతకు నల్లితెగులు ఆశించడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో మామిడి పూత ఆశాజనకంగా ఉండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వేటపాలెం మండల పరిధిలో పందిళ్లపల్లి, రామన్నపేట, చల్లారెడ్డిపాలెం గ్రామాల పరిదిలో దాదాపు 600 ఎకరాల్లో మామిడి తోటలు సాగు చేస్తున్నారు. ఈ ప్రాంతంలో పందిళ్లపల్లి గ్రామానికి చెంది బంగినపల్లి అంటే తెలియని వారుండరు. అన్ని రకాల కాయలు పంట పూర్తయిన తరువాత మే, జూన్ నెలలో పండు కాయలు మార్కెట్‌లోకి ప్రవేశిస్తుంటాయి. ఈ ఏడాది ఇంతవరకు పూత ఆశాజనంగా ఉన్నప్పటికీ మంచు కారణంగా పూత మాడిపోతుందని రైతులు వాపోతున్నారు.

> **గత ఏడాదికంటే మెరుగ్గా..**
>
> గత ఏడాది కౌలు డబ్బులు కూడా రాలేదు. ఈ ఏడాది ప్రస్తుతానికి పూత ఆశాజనకంగా ఉంది. అన్ని అనుకూలంగా ఉంటే ఈ ఏడాదైన కొంత లాభం వస్తుందని ఆశిస్తున్నాం. రాబోవు రోజుల్లో మంచు కురవడం తగ్గి, వర్షాలు పడకుండా ఉంటే బాగుంటుంది.
>
> శ్రీనివాసరెడ్డి, మామిడి రైతు



మామిడి తోటలో నిండుగా ఉన్న పూత

గృహ లక్ష్యాలు పూర్తిచేయాలి

బల్లికురవ: ప్రభుత్వం నవరత్నాల్లో భాగంగా జగనన్న కాలనీలో సొంత స్థలాలకు మంజూరు చేసిన పక్కా గృహాలను మార్చి 20వ తేదీ లోపు పూర్తి చేయించాలని ఎంపీడీవో సీహెచ్ కృష్ణ కోరారు. సోమవారం స్థానిక పరిషత్ కార్యాలయంలో 20 సచివాలయాల్లోని స్పెషల్ ఆఫీసర్లు, సెక్రటరీలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షించారు. మండలానికి 641 గృహాలు మంజూరుకాగా ఇంకా 215 గృహాలు నిర్మాణాలకు నోచుకోలేదని లబ్ధిదారులకు గ్రామాల వారీగా అవగాహనతో లక్ష్యాలు పూర్తి చేయాలన్నారు. సమీక్షలో గృహనిర్మాణ శాఖ ఏఈ దుర్గా రమేష ఈవోఆర్డీ సీతామహాలక్ష్మి అధికారులు తదితరులు పాల్గొన్నారు.



గృహ నిర్మాణాలపై సమీక్షిస్తున్న ఎంపీడీవో

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

చీరాల: మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం మంగళవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ పి.ఏసయ్య సోమవారం ప్రకటనలో తెలిపారు. సమావేశానికి కౌన్సిలర్లు, అధికారులు తప్పక హాజరుకావాలన్నారు.

ఆశ్రమ నిర్వాహకుడికి లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు

మార్టూరు: మండల కేంద్రంలోని అమ్మ అనాథ ఆశ్రమం పేరుతో సమాజ సేవ చేస్తున్న గుంటుపల్లి చందుకు హైదరాబాద్ రవీంద్ర భారతిలో ఆదివారం రాత్రి లైఫ్‌టైం అచీవ్‌మెంట్ పురస్కారం అందుకున్నారు. బీసీఎస్ వల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కరోనా సమయంలో బాటసారులకు నిత్యాన్నదానం చేసినందుకుగాను నిర్వాహకులు చందుకు సముద్రాల వేణుగోపాలాచారి చేతుల మీదుగా సత్కరించి, వివేకా నంద లైఫ్ టైం అచీవ్‌మెంట్ పురస్కారంతో పాటు గోల్డ్ మెడల్ అందజేశారు. కార్యక్రమంలో దైవజ్ఞశర్మ, విశ్రాంత జడ్జి బీ మధుసూదన్, వడ్డేపల్లిదాసు, డాక్టర్ శ్రీనివాస్ రాధా కుసుమ, కిరణ్, జూలకంటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



పురస్కారం అందుకుంటున్న ఆశ్రమ నిర్వాహకుడు చందు

ఎమ్మెల్సీ ఎన్నికలపై నిఘా



వాహనాలు తనిఖీ చేస్తున్న అధికారులు

బల్లికురవ: ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా మద్యం, డబ్బు తరలిస్తే ఎంతటి వారిపైనైనా కేసులు నమోదుతో వాహనాన్ని డబ్బును సీజ్ చేస్తామని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి జీ. సీతామహాలక్ష్మి హెచ్చరించారు. బల్లికురవ–సంతమాగులూరు, మల్లాయపాలెం–వేమవరం రోడ్లలో పలుహనాలు తనిఖీ చేశారు. తనిఖీలో ఏఎస్సై సీ. బాలకృష్ణ సిబ్బంది పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్‌తో చాలా ఉపయోగాలు

చీరాల రూరల్: కేంద్ర ప్రభుత్వ సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిటిటెడ్ (బీఎస్ఎన్ఎల్) అతి తక్కువ ఖర్చుతో అందించే సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆ సంస్థ చీరాల శాఖ డీఈ పి. మల్లిక్ పేర్కొన్నారు. ప్రజల సౌకర్యార్థం సోమవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద బీఎస్ఎన్ఎల్ ఆధ్వర్యంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వివిధ రకాల ఆఫర్లతో ప్రజలకు సిమ్ కార్డులు అందించారు. కేవలం రూ. 50 సంస్థకు చెల్లించినట్లయితే రూ. 245 రీచార్జ్‌చేసి 45 రోజులు పాటు అన్ లిమిటెడ్ కాల్స్ అందిస్తున్నట్లు చెప్పారు. అలానే రోజుకు 2 జీబీ ఇంటర్ నెట్ డేటా, 100 ఎస్ఎంఎస్‌లు అందిస్తున్నామని తెలిపారు. సోమవారం నిర్వహించిన ప్రత్యేక కౌంటర్ నందు అధిక సంఖ్యలో ప్రజలు తమ ఆధార్ కార్డును అందజేసి సిమ్‌కార్డులు తీసుకున్నారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సిమ్‌కార్డులు కొనుగోలు చేస్తున్న ప్రజలు

నిబంధనలు పాటించకుంటే జరిమానా



జరిమానాలు విధిస్తున్న ట్రాఫిక్ సిబ్బంది

చీరాల: నిబంధనలు పాటించని వాహనదారులపై సోమవారం ట్రాఫిక్ పోలీసులు జరిమానా విధించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారితో పాటు వాహనాలకు సరైన పత్రాలు లేని 30 మందిపై కేసులు నమోదు చేశారు. అలానే గతంలో విధించిన జరిమానాలు చెల్లించకుండా ఉన్న వారి వాహనాలను నిలుపుదల చేశారు. అతి వేగం, హెల్మెట్ లేకుండా నడుపుతున్న వారిపై కూడా జరిమనాలు విధించారు.

కొప్పరపాడులో ఆక్రమణల తొలగింపు

బల్లికురవ: గ్రామ పంచాయతీ పరిధిలోని రోడ్లు, సైడు కాలువలు ఆక్రమిస్తే స్వచ్ఛందంగా ఖాళీ చేయాలని లేకుంటే తామే తొలగిస్తామని కొప్పరపాడు సెక్రటరీ కేబీ అనిల్ కుమార్, వీఆర్‌వో వై శ్రీనివాసరావు హెచ్చరించారు. సోమవారం కొప్పరపాడు గ్రామంలోని నార్కెట్‌పల్లి, మేదరమెట్ల నామ్ రహదారి నుంచి గ్రామ పంచాయతీ కార్యాలయానికి వెళ్లే రోడ్డులో సైడు కాలువలు ఆక్రమించి ఇంటి ప్రహరీలు నిర్మించుకున్నారు. దీంతో అధికారులు పొక్లెయిన్‌తో ఆక్రమణలు తొలిగించారు. ఇదే ఆంధ్ర పగతి గ్రామీణ బ్యాంకుకు వెళ్లే రోడ్డులో కూడా ఆక్రమణలు ఉన్నాయని స్వచ్ఛందగా తీసివేయాలని చెప్పారు. లేకుంటే తామే తొలగిస్తామని సెక్రటరీ వీఆర్‌వోలతో పాటు గ్రామ సర్పంచ్ బండారు వెంకాయమ్మ గురువయ్య హెచ్చరించారు. ఈ రెండు రోడ్లను పంచాయతీ నిధులతో అంచనాలు తయారు చేసి సైడు కాలువలు నిర్మిస్తామని చెప్పారు. అంతకుముందు గ్రామం ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీలో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా చేపట్టారు.



ఆక్రమణలు తొలగిస్తున్న అధికారులు

విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రిత్వికవాసు

కారంచేడు: ప్రభుత్వం పాఠశాలల్లోని విద్యార్థులకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందిస్తోందని డాక్టర్ రిత్వికవాసు అన్నారు. సోమవారం ఆమె మండల కేంద్రం కారంచేడు అంబేడ్కర్‌నగర్ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. కంటి, పంటి సమస్యలతో పాటు, చర్మ వ్యాదులు, గుండె సంబంధిత సమస్యలు తలెత్తకుండా ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో జయశ్రీ, శ్రీనివాసరావు, ఎం జగదీశ్వరి, బాజీ, నాగరాజు, భవానీ, నిర్మలమేరి, హసీనా, శాంతి పాల్గొన్నారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: శుభకృత్ నామ సంవత్సరం. ఉత్తరాయణం పాల్గుణ మాసం రోహిణి నక్షత్రం దశమి సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు చేస్తారని శింగరకొండ దేవస్థాన ఏసీ సుభద్ర సోమవారం తెలిపారు. క్షేత్ర ప్రాధాన్యం ఉన్న మంగళవారం ఆంజనేయస్వామికి ఇష్టమైన ఆకుపూజ చేస్తే కోరిన కోర్కెలు నెరుతాయని చెప్పారు. ఉదయం 5గంటలకు సుప్రభాత సేవ, 5.30 గంటలకు బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు శ్రీ సువర్చలా సహిత దక్షిణాభిముఖ ప్రసన్నాంజనేయస్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

గోసంరక్షకుడికి సన్మానాల వెల్లువ



సుబ్బారావు కుటుంబాన్ని సన్మానిస్తున్న పుట్టంరాజు, సభ్యులు

అద్దంకి: గోమాత సంరక్షిస్తే భూమాతను రక్షించినట్లేనని గోసంరక్షణ బాధ్యుడు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి అన్నారు. ఈ నెల 24న బీసీఆర్ న్యూస్ వారి ద్వారా ఉత్తమ సోషల్ వర్కర్ అవార్డును ఢిల్లీలో అందుకున్న గోనుంగుంట సుబ్బారావును గోసంరక్షణ సమితి అద్దంకి బాధ్యులు సోమవారం ఘనంగా సన్మానించారు. ఎంపీ చేతలమీదుగా అవార్డు అందుకున్న సుబ్బారావు అద్దంకి ఖ్యాతిని దేశం నలుమూలలా వ్యాప్తం చేశారన్నారు. సుధాకరరావు, కాశీ ప్రసన్న, శేషారెడ్డి, నాగసూరి వెంకటసుబ్బారావు, ననుమర్తి రామారావు పాల్గొన్నారు.

నేడు టైలర్స్ డే వేడుకలు

చీరాల అర్బన్: చీరాల పట్టణ టైలర్స్, వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టైలర్స్ డే వేడుకలను మంగళవారం నిర్వహిస్తున్నట్లు ప్రతినిధులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 9గంటలకు స్థానిక ఎంజీసీ మార్కెట్ వద్ద గల దర్జీ కళాసూపం వద్ద టైలర్స్ డే 35వ వార్షికోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దర్జీ పతాకావిష్కరణ, విలియమ్స్ హోవే, కేఎం స్వామి చిత్రపటాలకు పూలమాల ఆవిష్కరణ, రోటరీ క్లబ్‌లో సభా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం నూతన కమిటీ ఎన్నిక జరుగుతుందన్నారు. పట్టణంలోని టైలర్లు అందరూ కార్యక్రమంలో పాల్గొనాలని వారు కోరారు.

రాధాకృష్ణ మందిరంలో ప్రత్యేక పూజలు

చీరాల అర్బన్: రోహిణి నక్షత్రం సందర్భంగా పట్టణంలోని పాపరాజుతోటలోని రాధాకృష్ణ మందిరంలో స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. దేవతామూర్తులను విశేషంగా అలంకరించారు. అనంతరం అమరావతి భక్త సమాజం వారిచే భగవద్గీత పారాయణం చేశారు. నల్లూరి బ్రహ్మం, శివాంజనేయప్రసాద్ పాల్గొన్నారు.

నేడు ప్రత్యేక అవసరాల పిల్లలకు వైద్యశిబిరం

చినగంజాం/పర్చూరు: పర్చూరు మండలంలోని నాగులపాలెం ఆర్ హైస్కూల్ ఆవరణలో బాపట్ల సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నేడు మంగళవారం ఉదయం 9 గంటలకు ప్రత్యేక అవసరాలు గల పిల్లకు మెడికల్ క్యాంప్ నిర్వహించనున్నట్లు చినగంజాం, పర్చూరు భవిత కేంద్రం ప్రత్యేక అవసరాల ఉపాధ్యాయులు తెలిపారు. క్యాంపునకు మండలంలోని 6 నుంచి 16 ఏళ్లలోపు ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు హాజరు కావాలని, ప్రత్యేక వైద్యులచే వైకల్యం నిర్ధారణ పరీక్షలు నిర్వహించి, వినికిడి లోపం ఉన్న విద్యార్థులకు వినికిడి యంత్రాలు, శారీరక వైకల్యం ఉన్న వారికి వీల్ చైర్స్, ట్రై సైకిల్స్, రోలెటర్స్, బుద్ధి మాంద్యం ఉన్న వారికి ఎంఆర్ కిట్స్, దృష్టి లోపం ఉన్న విద్యార్థులకు బ్రెయిలీ కిట్స్ మొదలగు ఉపకరణాలు అందజేస్తారని తెలిపారు. హాజరయ్యే విద్యార్థులు సదరం ద్వారా తీసుకున్న వైకల్యం ధ్రువీకరణ సర్టిఫికెట్ జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, రేషన్ కార్డు జిరాక్స్, క్యాస్ట్ సర్టిఫికేట్, రెండు పాస్ పోర్టు సైజ్ ఫోటోలు వెంట తీసుకు రావాలని కోరారు. పూర్తి వివరాలకు చినగంజాం, పర్చూరు మండలాల భవిత కేంద్రం ఉపాధ్యాయులు టీ బాలకృష్ణ 98664 97809, ఎం గీతాంజలి 80193 72721ను సంప్రదించాలని కోరారు.

చీరాల అర్బన్: చీరాల మండలంలోని భవిత కేంద్రంలో సమగ్రశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక అవసరాల గల పిల్లలకు మెడికల్ అసెస్‌మెంట్ స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించారు. ఈ క్యాంపుకు చీరాల, వేటపాలెం మండలాల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. వైద్యులు బి.ప్రతాప్‌కుమార్, టి.నాగకోటేశ్వరరావు, కె.చైతన్య, జిల్లా కో–ఆర్డినేటర్ కె.నాగేంద్రమ్మలు పాల్గొన్నారు. వైకల్యం నిర్ధారణ పరీక్షలు నిర్వహించి వినికిడి లోపం ఉన్న 49 మందిని గుర్తించారు. వీరికి వినికిడి యంత్రాలు, శారీరక వైకల్యం ఉన్నవారికి వీల్ చైర్స్, ట్రై సైకిళ్లు, రొటేవేటర్స్, బుద్ధిమాంద్యం ఉన్నవారికి ఎంఆర్ కిట్స్ ఉపకరణాలు అందిస్తారన్నారు. కార్యక్రమంలో ఐఈఆర్టీ రాజశేఖర్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో మాదిగలకు సముచిత స్థానం

కారంచేడు: జగనన్న పాలనలో వైఎస్సార్ సీపీ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలతో పాటు మాదిగ సామాజికవర్గానికి సముచిత స్థానం కల్పించిందని ఏపీ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ పార్టీ ఎస్సీ సెల్ నాయకులు చిరుమల సుధాకర్ మాదిగ అన్నారు. సోమవారం ఆయన మండలంలోని కేశవరప్పాడు గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎమ్మెల్సీ సీటుకు అమలాపురానికి చెందిన ఒక సామన్య మాదిగ సామాజికవర్గానికి చెందిన బొమ్మి ఇశ్రాయేలును ఎమ్మెల్సీగా ఎంపిక చేయడం అభినందనీయమన్నారు. అందుకు సీఎం జగన్ మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. గతంలో ఎన్నో రాజకీయ పార్టీలను చూశామని, వాళ్లంత మాదిగలను ఓటు బ్యాంక్‌గా మాత్రమే చూశారని పేర్కొన్నారు. వారికి సముచిత స్థానం కల్పించడంలో జగనన్నకు సాటి ఎవరూ లేరన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీస్ నాయకులు బండారు కోటేశ్వరరావు, బండారు అంకయ్య, కవిల నాగేశ్వరరావు, వలేరు భూషణం, కొదమల బుజ్జి, చిరుమల అంకమరావులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుధాకర్‌మాదిగ

అక్రమ రేషన్ బియ్యం స్వాధీనం

చీరాల టౌన్: ప్రజలకు పంపిణీ చేయాల్సిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా వ్యానులో తరలిస్తుండగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రూరల్ ఎస్సై పి.జనార్దన్ వివరాల మేరకు.. సోమవారం ఉదయం రూరల్ సీఐ మల్లికార్జునరావు ఈపురుపాలెం గ్రామంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా ఈపురుపాలెం నుంచి ఒంగోలు వైపు వెళ్తున్న ఏపీ 27 టీఎక్స్ 2995 వ్యానులో అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారు. ఈసమయంలో తనిఖీ చేయగా వ్యానులో 65 బస్తాలు రేషన్ బియ్యం బస్తాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈపురుపాలెం, తదితర ప్రాంతాల్లో బియ్యాన్ని సేకరించి వాహనంలో ఒంగోలు వైపుకు తరలిస్తుండగా పట్టుకున్నామని చెప్పారు. డ్రైవర్‌ను, మరో ఇద్దరు వ్యక్తులను స్టేషన్‌కు తరలించి విచారణ చేస్తున్నామన్నారు. సీజ్ చేసిన బియ్యం, మినీ లారీని స్టేషన్‌కు తరలించామని తెలిపారు. ఈ నెల 9వతేదీ కూడా ఈపురుపాలెం నుంచి మినీ లారీలో అక్రమంగా 75 బస్తాలు రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేశామని, రేషన్ బియ్యాన్ని రవాణా చేసిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్సై పేర్కొన్నారు.



రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనం

చీరాలలో గోవా మద్యం స్వాధీనం

చీరాల: చాలా కాలంగా గోవా మద్యానికి చీరాల అడ్డగా నిలుస్తోంది. చీరాలతో పాటు చుట్టు పక్కల గ్రామాల్లో భారీగా విక్రయాలు జరుగుతున్నాయి. దీంతో సెబ్ అధికారులు పక్కా సమాచారంతో విఠల్‌నగర్‌లోని ఒక నివాసంలో దాడులు నిర్వహించి గోవా మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. దాడులు సెబ్ సీఐ సోమయ్య ఆధ్వర్యంలో సిబ్బంది నిర్వహించారు. ఈ మేరకు సోమవారం స్థానిక సెబ్ కార్యాలయంలో సెబ్ డీఎస్పీ జి. నరసింహరావు విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. విఠల్‌నగర్‌కు చెందిన మొగిలి రామారావు, మొగిలి సుబ్బారావులు కొంతకాలంగా గోవా నుంచి అక్రమంగా మద్యం తీసుకువచ్చి స్థానికంగా విక్రయిస్తున్నారనే సమాచారం ఈమేరకు నివాసంపై దాడి చేయగా మ్యాన్షన్ హౌస్ ఫుల్ బాటిల్స్ 60 దొరికినట్లు తెలిపారు. వాటిని సీజ్ చేసి మొగిలి రామారావును అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరచినట్లు తెలిపారు. మరో ముద్దాయి సుబ్బారావు పరారీలో ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో ఎస్సై వినీల, సిబ్బంది పాల్గొన్నారు.



పట్టుబడిన గోవా మద్యంతో సెబ్ అధికారులు

వైద్య శిబిరం ఏర్పాటు అభినందనీయం

చినగంజాం: వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఇంకొల్లు జెడ్పీటీసీ భవనం శ్రీలక్ష్మి అన్నారు. ఒంగోలు కిమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో మండలంలోని వంకాయలపాడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని ఆమె ప్రారంభిచారు. వైద్యశిబిరం నందు కంటి పరీక్షలు, ఈసీజీ, బీపీ, షుగర్,గుండె, కిడ్నీ, విషజ్వరాల వ్యాధులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. మొత్తం 250 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ భవనం శ్రీనివాసరెడ్డి, వంకాయలపాడు ఎంపీటీసీ యామర్తి శిరోమణి, ఇంకొల్లు ఎంపీటీసీ హాయేషాబుడే. కిమ్స్ వైద్యులు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ షేక్ రఫీ, సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్‌లు, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ శ్రీలక్ష్మి

విద్యార్థులకు కళ్లజోళ్లు పంపిణీ

అద్దంకి: రోటరీ క్లబ్ ఆఫ్‌శింగరకొండ వారి ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు కళ్లజోళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని శంఖవరప్పాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. కార్యక్రమంలో కంటి సమస్యలతో బాధపడుతున్న 21 మంది విద్యార్థులకు దాత సోము రమణారెడ్డి సౌజన్యంతో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్‌శింగరకొండ అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆహారంలో ఏ విటమిన్‌ను తీసుకోవడం వలన కంటి సమస్యలు రాకుండా చూసుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు లక్కరాజు శ్రీనివాసరావు, రోటరీ ట్రెజరర్ తమ్మన శ్రీనివాసరావు, సభ్యులు పాల్గొన్నారు.



కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

1న సమన్వయ కమిటీ సమావేశం

అద్దంకి: ప్రముఖ పుణ్యక్షేత్రం శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల మార్చి 5వ తేదీ నుంచి 7వ తేదీ వరకు నిర్వహించనున్నారు. తిరునాళ్ల నిర్వహణ విషయమై అన్ని శాఖల అధికారులతో దేవస్థాన కమిటీ, ఈవో ఆధ్వర్యంలో మార్చి 1న టీటీడీ కళ్యాణ మండపంలో చీరాల ఆర్డీవో అధ్యక్షతన సమన్వయ కమిటీ రెండో సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఈవో సుభద్ర, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కోట శ్రీనివాసకుమార్ సోమవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. సమావేశానికి అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.